సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం ၊ 29 ၊ జనవరి ၊ 2024

సిరిసిల్ల మున్సిపల్‌లో ముసలం

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాఖాలో రాజకీయం వేడెక్కింది. సిరిసిల్ల మున్సిపల్‌లో ముసలం మొదలైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తీరుపై పేరుకుపోయిన అసంతృప్తి అవిశ్వాసానికి దారితీసింది. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రోజే ఎనిమిది మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడం చర్చనీయాంశమైంది.

- పూర్తి వివరాలు 8లో..



ఫుడ్ కోసమే కేయూలో చేరిన..



సిరిసిల్లక్రైం: చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని కాకతీయ యూనివర్సిటీలో చేరిన యువకుడు.. ఉద్యోగం వచ్చే వరకు యూనివర్సిటీని వదలొద్దనుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతే కావడంతో అద్దె గదుల్లో ఉండలేక ఫుడ్ కోసమే కేయూలో ప్రవేశాల కోసం పరీక్షలు రాశాడు. పోలీస్ ఉద్యోగంలో చేరి సమాజ శాంతి కోసం లాఠీ పట్టాడు. అదే సమాజ సేవ కోసం మనసుతో పనిచేశాడు. నక్సలైట్లు మూడు సార్లు అటాక్ చేసినా ప్రాణాలతో బయటపడ్డాడు. విధుల్లో అకుంఠిత దీక్ష.. నిబద్ధతే తనకు గుర్తింపు తెచ్చిందని.. అంటున్నారు సిరిసిల్ల అడిషనల్ ఎస్పీ చంద్రయ్య. ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సందర్భంగా సాక్షి పలకరించింది. ఈ సందర్భంగా తన జీవితంలోని ఎత్తుపల్లాలను పంచుకున్నారు..

- పూర్తి వివరాలు 8లో...

న్యూస్‌రీల్

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి పి.సుధకు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: రాజన్నను హైకోర్టు న్యాయమూర్తి పి.సుధ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫుల్ అడిషనల్ చార్జీ సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అద్దాల మంటపంలో మంత్రోచ్ఛరణల మధ్య ప్రసాదాలు అందించారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీలు చేయాలి



సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు తనిఖీలు చేయాలని పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం సమావేశమైన ప్రతినిధులు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీలు చేపట్టకపోవడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, గజభీంకార్ మల్లాజి, కుసుమ గణేష్, దేవదాసు, ప్రతాప్, వెంకటేశం, సందీప్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘాలు ఏర్పాటు చేయాలి



సిరిసిల్లటౌన్: దివ్యాంగుల కోసం కొత్తగా పొదుపు సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా దివ్యాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేందర్ కోరారు. స్థానిక గాంధీనగర్‌లో ఆదివారం సంఘం సమావేశంలో మాట్లాడారు. మధ్యలో నిలిచిపోయిన సంఘాలను గుర్తించి వాటిని పునరుద్ధరించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మామిడాల నరేష్, వెల్డి గణేష్, బొద్దుల రవి, ఎండీ ఖాదర్, సంధ్య, లత పాల్గొన్నారు.

విద్యారంగం కాషాయీకరణ



సిరిసిల్లక్రైం: కేంద్ర ప్రభుత్వం తన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని, విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు. శివనగర్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్ అధ్యతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, పొలాస మల్లేశం, కొత్వాల్ ప్రవీణ్, పాశం భాస్కర్, బాలరాజు, నరేశ్, పసుల సత్యం పాల్గొన్నారు.

మంకు రాజయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

- జీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



సిరిసిల్ల: విద్యారంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా మంకు రాజయ్య విగ్రహాన్ని సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. సిరిసిల్ల శివారులోని బోనాల వద్ద ఆదివారం జరిగిన మంకు రాజయ్య స్మారక టీచర్స్ ప్రీమియం లీగ్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా మాట్లాడారు. దివంగత ఎంఈవో మంకు రాజయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. విద్యాసంస్కర్తగా, సామాజిక సేవకుడిగా రాజయ్య సేవలకు గుర్తింపుగా ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీని మంకు రాజయ్య స్మారక వనరుల కేంద్రంగా మార్చాలని కోరారు. విజేతగా నిలిచిన ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి జట్లకు ట్రోఫీ అందించారు. ఉపాధ్యాయులు శర్మన్ నాయక్, నవీన్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బల్దియా తీరే వేరయా !



ఇది చంద్రంపేట నుంచి సిరిసిల్ల మొదటి బైపాస్‌రోడ్డుకు వెళ్లే దారిలో కూల్చి వేసిన ప్రీకాస్ట్ ప్రహరీ. ఇక్కడ నాలుగో తరగతి ఉద్యోగులు పలువురు గుంటల చొప్పున భవిష్యత్ అవసరాల కోసం స్థలం కొనుక్కుని రక్షణకు ప్రీకాస్ట్ వాల్ పెట్టుకున్నారు. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు కూల్చేశారు.



ఇది సిరిసిల్ల మినీస్టేడియం సమీపంలోనిది. ఇక్కడ దాదాపు 12 ఎకరాల్లో స్థలానికి గాను ప్రీకాస్ట్ వాల్ నిర్మిస్తున్నారు. ఇక్కడకు మాత్రం మున్సిపల్ అధికారులు రాలేదు. నిర్మాణాన్ని అడ్డుకోలేదు. సదరు స్థలంలో ప్రీకాస్ట్ వాల్ అడ్డుగా పెట్టి రియల్ వెంచర్ వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పై రెండు సంఘటనల్లో బల్దియా అధికారులు పెద్దలకు ఓ తీరు.. సామాన్యులకు మరో తీరు అన్నట్లు మెదులుతున్నారు. మున్సిపల్ చట్టంలో నిబంధనల అమలు పేరుతో కొన్ని సంఘటనల్లో అధికారులు సామాన్యుల ప్రీకాస్ట్ నిర్మాణాలు కూలఛ్చదం.. బడాబాబుల నిర్మాణాలను అడ్డుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొందరు బల్దియా సిబ్బంది నిర్వాకంతో జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న వివాదంపై సాక్షి ఫోకస్..



చంద్రంపేట-శాంతినగర్ సమీపంలో ప్రీకాస్ట్ వాల్

- పెద్దోళ్లకో రూల్.. చిన్నోళ్లకు మరో రూల్
- నిబంధనల అమలులో పక్షపాతం
- ప్రీకాస్ట్ వాల్ తొలగింపుల్లో వివాదం
- అనుమతుల పేరుతో కూల్చేడయంపై విమర్శలు
- స్థలం రక్షణకు అనుమతించాలంటున్న సామాన్యులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల జిల్లా కేంద్రంగా ఆవిర్భవించడంతో ఇక్కడి భూములకు రెక్కలు వచ్చాయి. సొంతింటి కల నిజం చేసుకుందామని ఆశపడ్డ నిరుపేదలు, నాలుగో తరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకున్న ఆర్థిక స్థోమతను బట్టి జిల్లా కేంద్రానికి ఆనుకొని గుంట నుంచి నాలుగు గుంటల వరకు స్థలాలు కొన్నారు. పెరుగుతున్న భూమి ధరలతో స్థలాలు అన్యాక్రాంతం కాకుండా తక్కువ ఖర్చుతో నిర్మించే ప్రీకాస్ట్ వాల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగా పలువురు రియల్టర్లు అనుమతుల్లేని లే అవుట్లను పట్టణ శివారులో కొనసాగిస్తున్నారు. అలాంటి అక్రమ లేఅవుట్లపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఖాళీ స్థలాల్లో ప్లాట్లుగా విభజించి ఖనీలు పాతుతుండగా తీసేస్తున్నారు. దీంతో కొందరు రియల్టర్లు లే అవుట్ లేని వెంచర్ల చుట్టూ ప్రీకాస్ట్ ప్రహరీలు ఏర్పాటు చేస్తూ బయటకు ఖనీలు కనిపించకుండా చేస్తున్నారు. దీంతో ప్రీకాస్ట్ నిర్మాణాలపై బల్దియా కఠినంగా వ్యవహరిస్తోంది. ఈక్రమంలో కొందరు పెద్దలను కాదని, సామాన్యులకు మాత్రమే నిబంధనలు అమలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

అధికారులు వాదన ఇదీ..

- గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ 1965 మున్సిపల్ ప్రకారం.. ఖాళీ స్థలానికి రెండు మీటర్ల ఎత్తువరకు ప్రహరీ(ప్రీకాస్ట్) పెట్టుకునే అవకాశం ఉంది.
- తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత టీఎస్ మున్సిపాలిటీస్ యాక్టు 2019 తర్వాత ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకునే అవకాశం లేదు.
- ఖాళీ స్థలాలకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలి. బిల్డింగ్ పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. మున్సిపల్ లే అవుట్ పర్మిషన్ లేని వెంచర్లలో కొనే స్థలాలకు బల్డింగ్ పర్మిషన్ ఇచ్చే అవకాశం లేదు.
- ఖాళీ స్థలాల రక్షణకు యజమానులు తప్పనిసరి ఎల్‌ఆర్‌ఎస్, భవన నిర్మాణ అనుమతులను ఆన్‌లైన్ ద్వారా తీసుకునే అవకాశం ఉంది. ఈక్రమంలో అధికారుల నుంచి ఇబ్బందులు ఉండవు. తద్వారా తమ స్థలాలకు కాంపౌండ్ నిర్మించుకోవచ్చు లేదంటే ఇల్లే కట్టుకోవచ్చు.

బాధితుల అవస్థలివీ..

- దశాబ్దం క్రితం మున్సిపల్ చట్టాలపై అవగాహన లేని చిరుద్యోగులు, సామన్యులు భవిష్యత్ అవసరాలకు చిన్న స్థాయి ప్లాట్లు కొన్నారు. వాటిని రెగ్యులరైజ్ చేసుకోవడంపై అవగాహన లేదు.
- సిరిసిల్ల శివారులో కొందరు రియల్టర్లు ఇండస్ట్రియల్ భూములను వెంచర్లుగా మార్చి భూములను అమ్ముకోగా.. ఆయా స్థలాల్లో మున్సిపల్ నుంచి భవన నిర్మాణాలకి అనుమతులు రావు.
- ఇలాంటి వారితోపాటు అనుమతులు ఉన్న వెంచర్లలో ప్లాట్లు కొన్నవారు తమ స్థలం చుట్టూ ఖనీ రాళ్లతో కంచెలు ఏర్పాటు చేసుకుంటే.. ఆక్రమణదారులు వాటిని సులువుగా తీసేస్తూ సామన్యుల స్థలాలు ఆక్రమిస్తున్నారు.
- ఊరవతల ఉండడంతో ఫినిషింగ్ రాళ్లు, ఇనుప తీగలను దొంగలు ఎత్తుకెళ్లడం.. ఆయా సమీపంలోకి వాహనాలు, జంతువుల సంచారంతో కూలి పోతున్నాయి.
- కొందరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా.. వివిధ ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు తెలియకుండా స్పందిస్తూ..చేతివాటానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- కొందరు అక్రమార్కులు, పక్క స్థలాలను దురాక్రమణకు పాల్పడేందుకు బల్దియాకు పలువురు ఫిర్యాదు చేస్తూ..సామన్యుల స్థలాల చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మాణాలు తొలగించేలా చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు వివాదాలకు కారణమవుతున్నాయి.

అక్రమ వెంచర్లపైనే చర్యలు



పట్టణ శివారులో రియల్టర్లు తమ వెంచర్ల చుట్టూ ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేసి లోపల ఖనీలు పాతి ప్లాట్లు విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించాం. అందుకే అక్రమ వెంచర్ల నిర్మూలనపై దృష్టి పెట్టాం. ఈ క్రమంలోనే ప్రీకాస్ట్ వాల్స్‌ను తీసేస్తున్నాం. చిన్న చిన్న ప్లాట్లు ఉన్నవారు మూడు ఫీట్ల ఎత్తులో ప్రీకాస్ట్ వాల్ పెట్టుకోవచ్చు. కానీ ప్రీకాస్ట్ నిర్మాణాలపై తొలగింపులో ఎలాంటి వివక్ష చూపడం లేదు. అక్రమాలకు తావులేదు. – ఎండీ అయాజ్, మున్సిపల్ కమిషనర్

పల్లెల్లో ప్రత్యేక పాలన !

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ఊరికో స్పెషల్ ఆఫీసర్
- నియామకానికి ప్రణాళిక సిద్ధం



బావుసాయిపేట గ్రామపంచాయతీ భవనం

గ్రామాల్లో ఇక ప్రత్యేక పాలన సాగనుంది. గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసిపోతుండగా.. ప్రత్యేకాధికారుల పాలనను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్లకు, జిల్లా పంచాయతీ అధికారులకు సంకేతాలిచ్చింది.

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామాలు, 2,422 వార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించేందుకు జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యేకాధికారులుగా మేజర్ గ్రామపంచాయతీలకు తహసీల్దార్, ఎంపీడీవో, డీఈఈలను, ఎక్కువ జనాభా ఉన్న పెద్ద గ్రామాలకు ఎంపీవో, డిప్యూటీ తహసీల్దార్‌లను నియమించనున్నారు. మిగతా గ్రామాలకు మండల పరిధిలోని వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఏఈవోలు, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. అత్యవసర సేవలందించే పీహెచ్‌సీ వైద్యులు మినహా మిగతా బాధ్యత గల అధికారులను గ్రామాకొకరి చొప్పున నియమించనున్నారు. అవసరాన్ని బట్టి డివిజన్ స్థాయి అధికారులను సైతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులుగా నియమించేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో కలిపి ప్రత్యేకాధికారులకు జాయింట్ చెక్‌పవర్ అధికారం కల్పించనున్నారు. ఇద్దరి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ పాలన, నిర్వహణ సాగనుంది. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు జరగని బద్దెనపల్లి, బాబాయిచెరువు తండా, గొల్లపల్లి గ్రామాల్లో, సర్పంచులు చనిపోయిన పోతిరెడ్డిపల్లె, దాచారం, సోమారంపేట, దేవునితండాల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన సాగనుంది.

పెండింగ్ బిల్లులు ఎలా ?

గ్రామ సర్పంచ్‌లుగా 2019 జనవరిలో జరిగిన ఎన్నికల్లో గెలిచారు. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ పాలకవర్గం తీర్మానించి చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం.. పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటికి 15 శాతం నిధులు, పంచాయతీ సిబ్బందికి 30 శాతం, ఇతర అవసరాలకు మరో 15 శాతం, మురికి కాల్వలు, తాగునీరు, కరెంట్ బిల్లులు, ట్రాక్టర్ నిర్వహణ, రహదారుల నిర్వహణ, ఇతర అవసరాలకు 40 శాతం నిధులను వెచ్చించే అవకాశం ఉంది. ఈ నిబంధనలతో గ్రామాల్లో నిర్వహణపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. మరోవైపు ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మరో మూడు రోజుల్లో సర్పంచుల పదవీకాలం ముగిసిపోతుండడంతో పెండింగ్ బిల్లుల బెంగ పట్టుకుంది. గ్రామపంచాయతీలకు ప్రధానంగా 15వ ఆర్థికసంఘం నిధుల్లో స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ నిధులు రావాల్సి ఉండగా.. ఏడాదిగా స్టేట్ ఫైనాన్స్ నిధులకు బ్రేక్ పడింది. సెంట్రల్ ఫైనాన్స్ నిధులు మూడు నెలలకోసారి వస్తున్నా.. అవి గ్రామపంచాయతీల్లో సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలకు సరిపోతున్నాయి. అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగలేదు. ఇప్పుడు పదవీకాలం ముగిసిపోతుండగా పెండింగ్ బిల్లులు ఎప్పుడు, ఎలా వస్తాయో తెలియక సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు.

మంత్రి మాటతో భరోసా..

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఇటీవల సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో చేసిన పనులను రీవెరిఫికేషన్ చేసి చెల్లిస్తామని స్పష్టం చేశారు. మంత్రి సీతక్క మాట సర్పంచుల్లో భరోసా కలిగించింది.

ప్రత్యేకాధికారుల జాబితా సిద్ధం చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకాధికారుల జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రతి గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రత్యేకాధికారుల నియామకాలు జరుగుతాయి. - ఎ.రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

ముస్తాబాద్ బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి సెగలు

- నేడు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం
- 30న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలోని బీఆర్‌ఎస్ నాయకుల్లో పేరుకుపోయిన అసంతృప్తి బయటపడుతోంది. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు నేడు మూకుమ్మడిగా రాజీనామాలు చేయనున్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్యతోపాటు మండలంలోని పది గ్రామాల సర్పంచులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఆదివారం ముస్తాబాద్‌లో సమావేశమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ జెండా కప్పుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమమైనట్లు తెలిసింది. వీరితోపాటు మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ఏఎంసీ మాజీ చైర్మన్లు బీఆర్‌ఎస్‌ను వీడనున్నట్లు సమాచారం. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, తెర్లుమద్ది సర్పంచ్ కలకొండ కిషన్‌రావుతోపాటు మరో తొమ్మిది గ్రామాల సర్పంచులు గులాబీ కండువాను వదిలి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈమేరకు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ రాజీనామాలను ప్రకటిస్తామని జెడ్పీటీసీ గుండం నర్సయ్య తెలిపారు. బీఆర్‌ఎస్‌లో జరిగిన అవమానాలు, ఒంటెత్తు పోకడలను నిరసిస్తూ ఆ పార్టీని వీడుతున్నామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ సిరిసిల్ల నియోజకవర్గం సమావేశం రోజునే ముస్తాబాద్ మండల సర్పంచులు, ఇతర నాయకులు పార్టీని వీడడం చర్చనీయాంశంగా మారింది.

హామీలు నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గోవిందరావుపేటతండాలో జీపీ భవనం ప్రారంభం
- మామిడిపల్లిలో కృతజ్ఞత ర్యాలీ



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం గోవిందరావుపేటతండా(బావుసాయిపేట)లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మామిడిపల్లిలో కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలు పటిష్టంగా ఉన్నప్పుడే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. మిగతా గ్యారంటీలను కూడా త్వరలోనే నెరవేర్చుతామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సర్పంచులు గుగులోతు రజిత, కొక్కుల భారత, ఎంపీటీసీ యాస్మిన్ పాషా, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రైమరీ పాఠశాల భవనం ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే సత్యం తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం కోరెంలో చెన్నాడి శాంతమ్మ-హన్మంతరావు, మార్తాండరావు స్మారకార్థం నిర్మించిన గ్రామపంచాయతీ, ప్రైమరీ పాఠశాల భవనాలను ఆదివారం ప్రారంభించారు. కోరెం సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్మించిన సొసైటీ ఆర్థికబ్యాంకు, గోదాం భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. చెన్నాడి సుధాకర్‌రావు కుటుంబంలో ఆరుగురు డాక్టర్లు, ముగ్గురు ఇంజినీర్లు ఉండడం గొప్పతనమన్నారు. వారి సేవలు మిగతా గ్రామాలకు విస్తరించాలని కోరారు. పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే ఉన్నత స్థానానికి చేర్చే సాధనమన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో పాలు పంచుకుంటామన్నారు. సర్పంచ్ చెన్నాడి రాజ్యలక్ష్మి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, డీసీ ఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ముదుగంటి సురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు జోగినిపల్లి వెంకట్‌రామారావు, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, దుర్గారెడ్డి, ఎంపీటీసీ మమత, వైద్యులు చెన్నాడి రవీందర్‌రావు, జగన్‌మోహన్‌రావు, అమిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రాణభిక్ష పెట్టండి

- క్యాన్సర్‌తో మంచంపట్టిన అయోధ్య
- చికిత్సకు రూ.3లక్షలు అవసరం
- దాతలు స్పందించాలని వేడుకోలు



క్యాన్సర్ తో బాధపడుతున్న అయోధ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ నిరుపేద ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. తన భర్తకు ప్రాణభిక్ష పెట్టండంటూ ఆ ఇల్లాలు వేడుకుంటోంది. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన జాగిరి అయోధ్య(40) ఆరు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొద్ది రోజులు చికిత్స చేసిన వైద్యులు అనుమానంతో నెల రోజుల క్రితం క్యాన్సర్ పరీక్షలు చేశారు. అయోధ్యకు క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు క్యాన్సర్ నివారణకు ఖరీదైన ఇంజక్షన్లు ఇవ్వాలని, అందుకు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు అప్పులు చేసి రూ.లక్ష వెచ్చించి వైద్యం అందించారు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక వైద్యం అందించే స్థోమత లేకపోవడంతో డబ్బుల కోసం దిక్కులు చూస్తున్నారు. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించి తన భర్త ప్రాణాలు కాపాడాలని అయోధ్య భార్య లావణ్య వేడుకుంటోంది. అయోధ్యకు భార్య లావణ్య, కుమారుడు సాయితేజ, కూతురు అర్చన ఉన్నారు. చిన్న వయసులోనే క్యాన్సర్ వ్యాధిన పడడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సైతం అంతంతే ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఆర్థిక సహాయం చేసే వారు..
ఫోన్‌పే, గూగుల్ పే : 9581795771లో ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు.

కారు, బైక్ ఢీ

- ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటకు చెందిన భూక్య వినయ్, నల్లూరి రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో సిరిసిల్లకు తరలించారు. కారు డ్రైవర్ కారుతోపాటు పరారయ్యారు.

అవిశ్వాసం అనేది అబద్ధం



మాట్లాడుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం అనేది అబద్ధపు ప్రచారమని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇలాఖాలో అవిశ్వాసమని గిట్టని వాళ్ల ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో 32 మంది కౌన్సిలర్లు ఉండగా.. ఆదివారం జరిగిన సమావేశానికి 24 మంది హాజరయ్యారని, మిగతా వాళ్లు అనారోగ్యం, వ్యక్తిగత కారణాలతోనే రాలేకపోయారన్నారు. ఇది కేవలం కేటీఆర్ ఇమేజ్‌కు నష్టం చేయడానికి బీఆర్ఎస్ వ్యతిరేక శక్తుల ప్రయత్నాన్ని ఖండిస్తున్నామన్నారు. కౌన్సిలర్లు ఆకుల కృష్ణ, గెంట్యాల శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, పార్టీ ప్రముఖులు మ్యాన రవి, దార్ల సందీప్, ఎండీ సత్తార్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కోసమే కేయూలో చేరిన..

- 'కాకతీయ' లోనే ఖాకీపై మమకారం
- నక్సలైట్ల ప్రాంతంలో పనిచేయడం గర్వంగా ఉంది
- వందల జీతం వచ్చిన రోజు హ్యాపీగా ఉన్నా..
- ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ బాధ్యతను పెంచింది
- పనితనంతోనే గుర్తింపు
- 'సాక్షి'తో సిరిసిల్ల అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లక్రైం: పోలీస్ కొలువుకు కావాలనుకుని రాలేదు. ఫుడ్ కోసమే కాకతీయ యూనివర్సిటీలో చేరిన. అక్కడ చదువుతుండగానే పోలీస్ నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాసి ఎంపికయ్యాను. పోలీస్‌గా చాలా గర్వంగా పనిచేసిన. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేయడం సంతృప్తినిచ్చింది. నన్ను చంపేందుకు నక్సలైట్లు మూడుసార్లు అటాక్ చేశారు. ప్రతీసారి మాదే పైచేయి అయ్యింది. నిత్యం శాంతిస్థాపన కోసం పనిచేశాం. నక్సలైట్ల కంటే రౌడీల ఆగడాలు విపరీతంగా ఉన్నాయని తెలిసి వారిపై ఉక్కుపిడికిలి బిగించాను. విధుల్లో నేను చూపిన తెగువ.. ఇన్నాళ్ల నా పనితనమే ఈ గుర్తింపును తెచ్చింది.. అని అంటున్నారు ఇటీవల ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన రాజన్నసిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య. అవార్డుకు ఎంపికైన సందర్భంగా సాక్షి పలకరించింది. ఈ సందర్భంగా సాక్షితో పంచుకున్న పలు విషయాలు ఆయన మాటల్లోనే..



పెద్ద కుటుంబం కావడంతో పోషణభారంగా..

అమ్మానాన్న రాజయ్య–మల్లమ్మ. మాది గన్నేరువరం. నాన్న రైల్వేలో చిరుద్యోగి. నాకు నలుగురు అన్నలు, నలుగురు అక్కలు. నేనే చిన్నవాడిని. అన్న ఆర్మీలో పనిచేయగా, ఇద్దరు గల్ఫ్ వెళ్లి వచ్చారు. మరొకరు వ్యవసాయం చేస్తున్నారు. ఉద్యోగరీత్యా నాన్న మహారాష్ట్రలో ఉండగా అక్కడే రెండో తరగతి వరకు చదువుకున్నాను. అక్కడి నుంచి మా సొంతూరిలోని ఓ పంతులు వద్ద నన్ను చేర్చి నెలకు రూ.100 ఇచ్చేవారు. ఐదో తరగతిలో పరీక్ష రాస్తే తెలుగు ఫెయిల్ అయ్యాను. తర్వాత ప్రతీ తరగతిలో మెరిట్ రావడంతో ఏడాదికి రూ.100 స్కాలర్‌షిప్ వచ్చింది. గన్నేరువరం జెడ్పీహెచ్ఎస్‌లో 64 మంది పదోతరగతి పరీక్ష రాస్తే ఒక్కడినే పాసయ్యాను. అనంతరం కరీంనగర్ బిషప్ సాలమన్ కళాశాలలో ఇంటర్ చదివాను. వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో బీఎస్సీ ఫిషరీస్ కోర్సు చదివాను. ఈ సమయంలో నేను అద్దెకు ఉండే కాలనీలో నక్సలైట్ల కోసం పోలీసులు తరచూ తనిఖీలు చేస్తుండడంతో భయంగా ఉండేది. దీనికితోడు మాది పెద్ద కుటుంబం కావడంతో చదివించడం ఇబ్బందిగా మారింది. నాన్న పడుతున్న కష్టాలను గమనించి కాకతీయ యూనివర్సిటీలో చేరాలని ప్రవేశ పరీక్ష రాయడంతో సీటు వచ్చింది. రెండేళ్లలో పీజీ పూర్తి చేశాను. కానీ జాబ్ రాలేదు. టీచింగ్ వైపు వెళ్లాలని ఇంగ్లిష్ కోర్సులో చేరాను. ఇలా భోజనానికి ఇబ్బంది ఉండదని యూనివర్సిటీలోనే ఉంటూ చదువుకున్నాను. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగానే పరీక్ష రాసి 1991లో ఆర్ఎస్సైగా విధుల్లో చేరాను. నాకు ఆ సమయంలో రూ.1,280 జీతం వచ్చేది. అప్పుడు ఆ జీతంతోనే హ్యాపీగా ఉన్నాం.

రౌడీలపై ఉక్కుపాదం.. సామాజిక సేవతో ముందుకు..

నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేసిన అనుభవంతో రౌడీలను అణచివేసేందుకు ఉపయోగపడింది. నక్సలైట్ల కంటే రౌడీల ఆక్రమణలు, ఆరాచకాలు పెరిగినట్లు తెలిసింది. వారిని అదుపులోకి తెచ్చేందుకు మహిళా సంఘాలు లాఠీ కొనిచ్చిన సందర్భాలు ఉన్నాయి. నన్ను చంపేస్తామని గోడలపై హెచ్చరికలు రాసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. హన్మకొండలో ఓ రౌడీ అక్కడ ఉండేందుకే భయపడేలా పరిస్థితులు సృష్టించిన. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పని చేస్తున్న సమయంలోనే తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. ఆ ప్రాంతంలో అల్లర్లు జరుగకుండా పని చేసిన. కొత్తగూడెంలో ఎస్సైగా పనిచేసిన రోజుల్లో రోడ్డు వేయడం, అక్కడ ఉన్న చిరువ్యాపారులకు పది గజాల స్థలాన్ని ఇప్పించడం వంటి సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

పైరవీలకు దూరం..

కొలువులో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ కూడా పైరవీలు చేయలేదు. నా పనితనాన్ని గుర్తించే పదోన్నతులు లభించాయి. నేను విధుల్లో చేరిన తొలి రోజుల్లో రాజకీయ నాయకులకు పోలీస్ బందోబస్తు లేదు. శాంతిస్థాపన కోసం ప్రజలతో కలిసి పనిచేసేవాళ్లం. మేము నాయకుల వద్దకు పోతే ఎక్కడ నక్సలైట్లు చంపుతారోనని వారు భయపడేవాళ్లు. ఇప్పుడు దర్పం కోసం పోలీస్ బందోబస్తు పెట్టుకుంటున్నారు.

శాంతి నెలకొల్పడమే ప్రాథమిక విధి

నేను పోస్టింగ్‌లో చేరినప్పటి నుంచి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందే వరకు ప్రజలకు అన్యాయం చేసే విధానాలు, నక్సలైట్ల చర్యలను అడ్డుకునేందుకు పనిచేసిన. నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు యువ ఆఫీసర్లు కావాలని అడిగితే 1992లో 18 మందితో ఎస్ఎస్ఎఫ్(స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్) ఏర్పాటు చేశారు. అందులో 1998 వరకు ప నిచేశాం. శ్రీకాకుళం, ఆదిలాబాద్, చిత్తూరు, విశాఖరూరల్, ఏటూరునాగారం ఏరియాల్లో గుట్టల్లో తిరుగుతూ నక్సలైట్ ఉనికిని అడ్డుకునేవారిమి. గుట్టలు, గుహల్లో తిరుగుతూ చెలిమల్లో పురుగులు ఉన్న నీటి తాగినం. ఏటూరునాగారంలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు అనేకసార్లు నన్ను చంపేందుకు అటాచ్ చేసి, విఫలమయ్యారు. 1992 సివిల్ ఎస్సైగా కన్వర్షన్ కాగా వరంగల్, కొత్తగూడంలో పోస్టింగ్ వచ్చింది. కాలంలో ఫోన్ సౌకర్యం లేదు. అలాంటి పరిస్థితుల్లో జనశక్తి, ప్రజాప్రతిఘటన, పీపుల్స్‌వార్, ప్రతిఘటన వంటి విప్లవ సంఘాలు పనిచేసేవి. ఎటూ వెళ్లిన కాల్పులు జరిగేవి. మూడు సార్లు నన్ను చంపేందుకు అటాక్ జరిగింది. స్కూల్‌కు సెలవులు ఉన్నాయని స్టేషన్ క్వాటర్స్‌లో ఉన్న నా దగ్గరి భార్యపిల్లలు వచ్చారు. అదే రోజు నాపై నక్సలైట్లు దాడి చేశారు. నా భార్యపిల్లలు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని బతికారు. నా పిల్లలు ఇప్పుడు ఒకరు డాక్టర్, ఇంకొకరు అమెరికాలో సైంటిస్ట్‌గా స్థిరపడ్డారు. 2007 సీఐగా, 2017లో డీఎస్పీగా, 2021లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందాను. సిరిసిల్లలో 2022, జనవరిలో అడిషనల్ ఎస్పీగా విధుల్లో చేరాను.

ఆశయం కోసం పనిచేయాలి

పోలీసు అంటే విపత్కర పరిస్థితుల్లో నిస్సహాయులకు అండగా ఉండడమే. దాన్ని గుర్తుంచుకుని యు వ ఆఫీసర్లు పనిచేయాలి. ఏదో ఆశించి పనిచేస్తే అభాసుపాలవుతామనే విషయాన్ని గుర్తుంచుకో వాలి. పైరవీలతో పోస్టింగ్ వస్తే అదే స్థాయిలో వక్రమార్గంలో అధికారులు పనిచేస్తారని ప్రభుత్వం, పా లకులు గమనించాలి. పనితనాన్ని గుర్తించి పోస్టింగ్ ఇస్తే సమాజం కోసం పనిచేసే ఆఫీసర్స్ వస్తారు. వారిని ప్రభుత్వాలు, అధికారులు ప్రోత్సహించాలి.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్నేహ



స్నేహ

కరీంనగర్‌స్పోర్ట్స్: బిహార్‌లో ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన స్నేహ ఎంపికై నట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. బెజ్జంకికి చెందిన స్నేహ ఈనెల 15 నుంచి 17 వరకు ఆదిలాబాద్‌లో జరిగిన జూనియర్స్ హ్యాండ్ బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి తెలంగాణ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్నేహను తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్యామల పవన్‌కుమార్, డీవైఎస్‌వో రాజావీరు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ వేల్పుల సురేందర్, సిరిసిల్ల జిల్లా కన్వీనర్ కృష్ణహరి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పెద్దబోయిన శ్రీనివాస్, ప్రేమ్, విద్యాసాగర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

కొండచిలువ ప్రత్యక్షం



ప్రత్యక్షమైన కొండచిలువ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణశివారు పెద్దమ్మనగర్ (17వవార్డు) లో ఆదివారం కొండచిలువ ప్రత్యక్షమైంది. కాలనీవాసులు దానిని గుర్తించి స్థానికులకు సమాచారమందించారు. యువకులు కర్రల సాయంతో కొండచిలువను పట్టి దూరప్రాంతంలో వదిలేసి వచ్చారు.

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో ముసలం

- చైర్‌పర్సన్‌పై వ్యతిరేక గళం
- అవిశ్వాసానికి పట్టుబడుతున్న వైనం
- కేటీఆర్ ఇలాఖాలో వ్యతిరేక పవనాలు
- క్యాంపునకు వెళ్లిన ఎనిమిది మంది కౌన్సిలర్లు
- స్థానికంగా చక్రం తిప్పుతున్న మరో ఎనిమిది మంది..
- కేటీఆర్ వచ్చిన రోజే క్యాంపు రాజకీయానికి తెర



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్‌లో ముసలం మొదలైంది. కొన్ని నెలలుగా నివురుకప్పి ఉన్న అవిశ్వాసం చర్చకు మొదటి అడుగుపడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తీరుపై పెల్లుబుకిన వ్యతిరేక గళం అవిశ్వాసం వరకు తీసుకెళ్లింది. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రోజే ఎనిమిది మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాఖాలో అవిశ్వాస ముసలం పుట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

క్యాంపు రాజకీయానికి తెర

సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, అతని అనుచరులు ఐదుగురి వ్యవహారంపై కౌన్సిలర్లలో వ్యతిరేకత నెలకొంది. కాంట్రాక్టు పనులు, బిల్లుల చెల్లింపుల విషయాల్లో చైర్‌పర్సన్ భర్తపై మెజార్టీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. గతంలోనూ కొందరు కౌన్సిలర్లు కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం పట్టణంలో అభివృద్ధి పనుల నిమిత్తం అప్పటి మంత్రి కేటీఆర్ రూ.40కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులను స్థానిక కాంట్రాక్టర్లకు రానీయకుండా హైదరాబాద్‌లోని ఏ–1 క్లాస్ కాంట్రాక్టర్‌కు మూడు ప్యాకేజీలుగా చేపట్టడానికి చైర్‌పర్సన్ భర్త అప్పజెప్పడాన్ని కౌన్సిలర్లు తప్పుబట్టారు. ఎన్నికల కోడ్‌తో సదరు కాంట్రాక్టు పనులు మొదలు పెట్టలేదు. చైర్‌పర్సన్ భర్త ఒక్కడి స్వార్థమే తమకు పర్సంటేజీలు రాకుండా అడ్డుకుందని పలువురు కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.

మరో పది మంది కోసం క్యాంపు

చైర్‌పర్సన్ భర్త తనకు సన్నిహితంగా ఉండే ఐదారుగురు కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు రూ.40 కోట్ల పనులు మొదలు పెట్టకుండానే రద్దవడంపై చాలా రోజులుగా కౌన్సిలర్లు విభేదిస్తున్నారు. వార్డుల్లో పనులు, కమీషన్లు, ఏక చత్రాధిపత్యం తదితర అంశాలపై బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు రాష్ట్రస్థాయి నాయకుడితో మొరపెట్టుకున్నారు. దీనిపై జనవరి 25 వరకు ఓపిక పట్టాలని సూచించిన సదరు రాష్ట్రస్థాయి నాయకుడు జనవరి 26న సిరిసిల్లకు వచ్చి కౌన్సిలర్లకు సమాధానం చెప్పకుండా వెళ్లడంతో రెండు రోజుల క్రితం క్యాంపు రాజకీయానికి భీజం పడింది. ఆదివారం సిరిసిల్లకు ఎమ్మెల్యే కేటీఆర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి వస్తున్నారని తెలిసి ఎనిమిది మంది కౌన్సిలర్లు యాదాద్రి, హైదరాబాద్ ప్రాంతాలకు క్యాంపునకు వెళ్లినట్లు ప్రచారంలో ఉంది. అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇవ్వడానికి 26 మంది కౌన్సిలర్ల అవసరం ఉందని, ప్రస్తుతం క్యాంపులో ఎనిమిది మంది ఉన్నారని, మరో ఎనిమిది మంది స్థానికంగా ఉంటూ చక్రం తిప్పుతున్నారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. మరో పదిమందిని పోగేసి అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వడానికి సన్నాహాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖుడు, రాష్ట్రస్థాయి నాయకుడు కూడా పార్టీ వీడుతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఇటీవల ఎన్నికల నేపథ్యంలో కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఇప్పించినట్లు సమాచారం. ఈక్రమంలో సదరు నాయకుడిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం మరో విశేషం.

అవిశ్వాసానికి అరకోటి ఆఫర్లు

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి తప్పించి తమకు కట్టబెడితే కౌన్సిల్‌కు అరకోటి రూపాయలకు తగ్గకుండా ఇస్తామని ఆశావహులు ఆఫర్లు ప్రకటిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇన్నాళ్లు మంత్రిగా ఉన్నప్పుడు కే.తారకరామారావు కనుసన్నల్లో నడిచిన రాజకీయం ఇప్పుడు మార్పు చెందడం సిరిసిల్లలో హాట్‌టాపిక్‌గా మారింది. చైర్‌పర్సన్, పార్టీ పట్టణ అధ్యక్షుడి పదవుల మార్పును కోరుతూ పలువురు కౌన్సిలర్లు క్యాంపు రాజకీయానికి తెరలేపడం విశేషం. చైర్‌పర్సన్ పదవికి ప్రధానంగా ముగ్గురు పేర్లు చర్చకు వస్తున్నాయి. అందులో ఒకరు తమను చైర్‌పర్సన్ చేస్తే రూ.50లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. మరో కౌన్సిలర్ ఒక్కొక్కరికి రూ.లక్షతోపాటు నార్త్ ఇండియా టూర్, మరో కౌన్సిలర్ తమకు ఓటేస్తే 20 మంది కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ.3లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ స్థానంలో ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీలోనే అభ్యర్థిని ఎన్నుకోవడానికి పలువురు ముఖ్య కౌన్సిలర్లు పావులు కదుపుతుండటం విశేషం. ఇదిలా ఉంచితే మరోవైపు చైర్‌పర్సన్‌పై వ్యతిరేకత ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరే సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు కాంగ్రెస్‌లో చేరేందుకు వెళ్లారా.. పార్టీకి ఝలక్ ఇచ్చేందుకు క్యాంపు రాజకీయానికి తెరలేపారా.. అనే విషయం త్వరలోనే తేలనుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- నేరం జరిగితే 1930లో సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అనధికారిక వెబ్‌సైట్స్, ఫోన్ నంబర్స్‌ను క్లిక్ చేసినా, తక్కువ ధరకు ఎక్కువ వస్తువులు వస్తున్నాయని ఆఫర్లు చూసి ఆర్థిక లావాదేవీలు జరిపినా సైబర్ నేరగాళ్లు దోచుకుంటారని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు మోసగించినట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. నేషనల్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(ఎన్సీఆర్పీ)లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. మన అనుమతి లేకుండా వచ్చిన ఓటీపీలను ఎవరు అడిగినా చెప్పొద్దని సూచించారు .ఆఫర్ల పేరిట వచ్చే లోన్ యాప్‌లను శ్రద్ధగా పరిశీలించాలని సూచించారు. అవసరం లేని యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దన్నారు.

జిల్లాలో ఈ వారంలో జరిగిన ఘటనలు ఇవీ..

- ఎల్లారెడ్డిపేట స్టేషన్ పరిధిలో ఒకరికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనకు సంబంధించిన వాళ్లు ఆసుపత్రిలో ఉన్నారని చెప్పి రూ.10వేలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. కానీ తీరా అతను సంబంధిత పేరుగల వారిని అడిగితే తాము ఆసుపత్రికే వెళ్లలేదని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు.
- చందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలోని బాధితుడికి ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ నుంచి ఏటీఎం వచ్చిందని కాల్ చేసి ఓటీపీ కావాలని కోరారు. ఓటీపీ చెప్పగా అతని అకౌంట్ నుంచి రూ.6 వేలు ఖాళీ అయ్యాయి.
- సిరిసిల్ల టౌన్ సేషన్ పరిధిలోని ఒకరికి క్రెడిట్ కార్డు అప్‌డేట్ చేయాలని గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. కార్డు అప్‌డేట్ కోసం వివరాలు అడగ్గానే చెప్పడంతో బ్యాంక్ ఖాతా నుంచి రూ.30 వేలు సైబర్ నేరగాళ్లు లాగేశారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో మరో బాధితుడు నటరాజ్ పెన్సిల్ కంపెనీ యాడ్‌ను చూసి అందులోకి లాగిన్ అవడానికి ప్రయత్నించి రూ.5 వేలు కోల్పోయాడు. జరిగిన అన్ని సైబర్ నేరాలపై ఫిర్యాదులు రాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేను ఇక్కడే ఉంటా..



మాట్లాడుతున్న కేటీఆర్

- కంటికి రెప్పలా కాపాడుకుంటా..
- పోయేవాళ్లు పోతరు.. ఉన్నోళ్లే మనోళ్లు
- సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు

సిరిసిల్ల: నేను ఇక్కడే ఉంటా.. ఎక్కడికి పోను.. అని సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. తాను సిరిసిల్లను విడిచిపోతున్నట్లు ప్రచారం చేస్తున్నారని, 15 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా.. కంటికి రెప్పలా మిమ్మల్ని కాపాడుకుంటానంటూ స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి.. రాష్ట్ర స్థాయిలో పనిచేయాల్సి వచ్చిందని, ఇప్పుడు పెద్దగా పనేమీ లేదని.. మీకు అండగా ఉంటానన్నారు. కొద్ది తేడాతోనే అధికారం కోల్పోయామని, నిరాశకు గురికావద్దని కోరారు. మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లోనే 13 హామీలు ఉన్నాయని, అన్నింటిని అమలు చేయాలన్నారు.

నేతన్నలకు అండగా ఉంటా..

కాంగ్రెసోళ్లు సిరిసిల్ల నేతన్నలను బెదిరిస్తున్నారని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏమైనా తేడా వస్తే.. 39 మంది ఎమ్మెల్యేలం రోడ్డెక్కుతామని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉండగా.. ఉన్నోళ్లే మనోళ్లని, ఎవరూ వెళ్లినా భయపడేది లేదన్నారు. జిల్లా కమిటీలను వేసుకొని, అధికార ప్రతినిధులను నియమించుకుని, పనిచేసే వాళ్లకు పార్టీ పదవులు ఇస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో 89వేల ఓట్లు రాగా.. ఈ సారి 29 వేలు వచ్చాయని ఎందుకు మెజార్టీ తగ్గిందో ఆలోచించుకోవాలన్నారు. నాలోనూ లోపం ఉంటే సరిదిద్దుకుంటానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయాలని, స్థానికసంస్థల ఎన్నికల్లో మీ కోసం నేను పనిచేస్తానని తెలిపారు. మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పుడు కష్టకాలంలో ఉన్నాం.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి తేవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, జెడ్పీటీసీలు కళావతి, విజయ, చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీలు మానస, రేణుక, కరుణ, పార్టీ నాయకులు గజభీంకార్ రాజన్న, సురేందర్‌రావు, కృష్ణహరి, వెంకటస్వామిగౌడ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం

గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని నాయకులు, శ్రేణులతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ నిర్మాణం, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.



రాజన్నకు సమ్మక్క భక్తుల జాతర



వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం రాజన్నను 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఆది, సోమవారాలు నిరంతర దర్శనాలకు అనుమతించారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గాయపడిన మైనింగ్ సర్దార్ మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–2ఏ గనిలో ఈనెల 22న జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి ఆదివారం మృతి చెందారు. గనిలో మొదటి షిఫ్టులో 2వ సీమ్‌లోని 9వ లెవల్ ఎండ్‌లెస్ వద్ద టబ్బుల లింక్ ఊడిపోయి వేగంగా వచ్చి సమ్మిరెడ్డిని ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. గాయపడ్డ సమ్మిరెడ్డిని వెంటనే గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించినా.. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫరల్ చేశారు. వారం రోజులపాటు అక్కడ చికిత్స పొందిన సమ్మిరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. మృతుడినికి భార్య, పిల్లలు ఉన్నారు.